సాక్షి
పశ్చిమగోదావరి
గురువారం, 15, మే, 2025



సీట్లు పాయె.. నిధులు రావాయె

ఏపీ నిట్‌లో విద్యార్థుల భవితవ్యం మసకబారుతోంది. నిట్‌లో సీట్ల సంఖ్య భారీగా తగ్గించేయడంతో ఇక్కడి విద్యార్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 8లో



వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి

పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో వైద్యం అందక గర్భిణి మృత్యువాత పడింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. 8లో



పోలవరంలో భారీ చోరీ

పోలవరంలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. 25 కాసుల బంగారం, నాలుగు కేజీల వెండి, రూ.8.60 లక్షల నగదు అపహరించారు. 8లో

న్యూస్‌రీల్

ఆస్థాన విద్వాంసుడిగా కేవీ సత్యనారాయణ



నాట్యగురువు సత్యనారాయణకు నియామక పత్రాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల : శ్రీవారి దేవస్థానం ఆస్థాన విద్వాంసుడిగా తనను ప్రకటించడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్టు ఏలూరుకు చెందిన ప్రముఖ కూచిపూడి నాట్య గురువు, సినీ నృత్య దర్శకుడు, నాట్య కళా విశారద కేవీ సత్యనారాయణ అన్నారు. ఎన్నో ఏళ్లుగా తన నాట్యం ద్వారా శ్రీవారిని సేవిస్తున్నట్టు చెప్పారు.

అందరికీ ఇళ్లు పథకంలో స్థలాలు

భీమవరం (ప్రకాశంచౌక్): 'అందరికీ ఇళ్లు' (హౌసింగ్ ఫర్ ఆల్) పథకం కింద జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి 3 సెంట్లు, పట్టణ ప్రాంతాలలో 2 సెంట్లు భూమిని ఇంటి స్థలంగా కేటాయించేందుకు ప్రభుత్వం మార్గదర్శక, నిబంధనలు జారీ చేసినట్లు జాయింట్ కలెక్టర్ రాహుల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పథకానికి సంబంధించి సందేహాలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నివృత్తి చేసికొవచ్చు. ఈ పథకాన్ని అర్హత ఉన్న లబ్ధిదారులు వినియోగించుకోవాలని జాయింట్ కలెక్టర్ తెలిపారు.

ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలకు 574 మంది గైర్హాజరు

భీమవరం: జిల్లా వ్యాప్తంగా బుధవారం నిర్వహించిన ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షల్లో 574 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఇంటర్మీడియట్ జిల్లా విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు చెప్పారు. మొదటి సంవత్సరం పరీక్షలను 40 పరీక్షా కేంద్రాల్లో నిర్వహించగా జనరల్ కేటగిరిలో 9,525 మందికి 9,111 మంది హాజరు కాగా ఒకేషనల్ కేటగిరిలో 557 మందికి 58 మంది గైర్హాజరయ్యారన్నారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్ష 18 కేంద్రాల్లో నిర్వహించగా జనరల్ కేటగిరిలో 1,300 మందికి 1,214 మంది హాజరుకాగా ఒకేషనల్ కేటగిరిలో 180 మందికి 162 మంది విద్యార్థులు హాజరయ్యారని ఎక్కడా మాల్‌ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని నాగేశ్వరరావు తెలిపారు.

పాలిసెట్‌లో 6,169 మంది ఉత్తీర్ణత

భీమవరం: పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షలో జిల్లాల్లో 95 శాతం విద్యార్థులు హాజరయ్యారని పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఫణీంద్ర ప్రసాద్ చెప్పారు. పాలిసెట్ పరీక్షకు 7,271 మంది పరీక్ష ఫీజులు చెల్లించగా 6,489 మంది పరీక్షకు హాజరయ్యారని వీరిలో 6,169 మంది ఉత్తీర్ణత సాధించారన్నారు. పాసైన వారిలో 3,634 మంది బాలురు, 2,535 మంది బాలికలు ఉన్నారన్నారు. రాష్ట్ర స్థాయిలో బి.శేఖర్ 4వ ర్యాంకు సాధించగా, వి.ప్రవల్లిక 6వ ర్యాంకు, కె.కృష్ణ ప్రణయ్ 9వ ర్యాంకు సాధించారని ఫణీంద్ర ప్రసాద్ తెలిపారు.

రెవెన్యూ పిటిషన్లు సత్వరం పరిష్కరించాలి

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో ఫేజ్ -1 రీసర్వే మే నెలాఖరునాటికి పూర్తిచేసి గెజిట్ నోటిఫికేషన్ విడుదలకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. బుధవారం భీమవరం జాయింట్ కలెక్టర్ చాంబరులో జాయింట్ కలెక్టర్ రీ సర్వే, పీజీఆర్ఎస్, అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల కేటాయింపు, తదితర అంశాలపై గూగుల్ మీట్ ద్వారా ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, సర్వే అధికారులతో సమీక్షించారు. ఫేజ్ 2 రీసర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. పీజీఆర్ఎస్ సమస్యల పరిష్కారంలో ఏఐ టెక్నాలజీని వాడి సమస్యలు నాణ్యతతో పరిష్కరించుకోవచ్చన్నారు. అందరికీ ఇళ్ల పథకం కింద గ్రామీణ ప్రాంతాలలో 3 సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు భూమిని కేటాయించేందుకు మార్గదర్శకాలతో ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసిందన్నారు.

వర్క్ ఇన్‌స్పెక్టర్ల తొలగింపు

నూజివీడు: మండలంలోని సుంకొల్లులో గృహ నిర్మాణలకు సంబంధించి సిమెంట్, స్టీలు అవకతవకల విషయంలో గృహనిర్మాణ శాఖలో అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఐదుగురు వర్క్ ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తొలగిస్తున్నట్లు గృహనిర్మాణ శాఖ జిల్లా అధికారి జీవీవీ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులకు సంబంధించిన మెటీరియల్ పక్కదారి పట్టిందని వచ్చిన ఆరోపణలపై విచారణ జరపాలని గృహ నిర్మాణశాఖ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అధికారులను ఆదేశించారు. విచారణలో 2,450 బస్తాల సిమెంట్, 11,952 కిలోల స్టీలు లబ్ధిదారులకు అందలేదని తేలింది.

సోపానంపై సైలెంట్

- కార్పొరేషన్ సబ్సిడీ రుణాల మంజూరుకు తాత్కాలిక బ్రేక్ ?
- జిల్లాకు రూ. 122.5 కోట్ల విలువైన యూనిట్ల కేటాయింపు
- కూటమి శ్రేణుల నుంచి అధిక సంఖ్యలో దరఖాస్తులు
- కావాల్సిన వారి పేర్లతో జాబితాలు సిద్ధం చేసి పంపిన ఎమ్మెల్యేలు
- ఇంకా సబ్సిడీ నిధులు విడుదల చేయని సర్కారు



స్వయం ఉపాధి సోపానం రుణాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న దృశ్యం (ఫైల్)

యలమంచిలి మండలానికి చెందిన కూటమి భాగస్వామ్య పక్ష నేత ఒకరికి కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలకు ఎంపిక చేసిన జాబితాలో చోటు దక్కగా ఇంటర్వ్యూకు హాజరయ్యారు. అధికారులు త్వరలో రుణం మంజూరవుతుందని చెప్పారు. నెల రోజులు కావస్తున్నా రాకపోవడంతో ఆరా తీయగా సబ్సిడీ సొమ్మును ప్రభుత్వం విడుదల చేయలేదని, ఎప్పుడు వస్తుందో ఇంకా స్పష్టత లేదని తెలిసింది. స్వయం ఉపాధి కోసం ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా సబ్సిడీ రుణాలు ఇచ్చేందుకు రెండు నెలల క్రితం హడావుడి చేసిన కూటమి ప్రభుత్వం అంతలోనే సైలెంట్ అయిపోయింది. 'స్వయం ఉపాధి సోపానం' పేరిట లబ్ధిదారుల ఎంపికకు ఇంటర్వ్యూలు సైతం నిర్వహించగా ఇప్పుడు వాటి ఊసే వినిపించడం లేదు.

సాక్షి, భీమవరం: ఎస్సీ, బీసీ–ఏ, బీసీ–బీ, బీసీ–డీ, బీసీ–ఇ తో పాటు ఈడబ్ల్యూఎస్ వర్గాల్లోని రెడ్డి, కమ్మ, వైశ్య, బ్రాహ్మణ తదితర వర్గాలకు స్వయం ఉపాధి, జనరిక్ ఫార్మసీలు, ఎంఎస్ఎంఈ యూనిట్ల ఏర్పాటుకు సబ్సిడీ రుణాల మంజూరుకు కూటమి ప్రభుత్వం మార్చిలో చర్యలు చేపట్టింది. జిల్లాకు రూ.122.5 కోట్ల విలువైన 3,728 యూనిట్లను కేటాయించింది. వీటిని రూ.2 లక్షలు, రూ.2 నుంచి రూ.3 లక్షలు, రూ.3 లక్షల నుంచి రూ.5 లక్షల కేటగిరీలుగా విభజించింది. జనరిక్ మెడికల్ షాపుల యూనిట్ ధర రూ.8 లక్షలుగా ఉంది. యూనిట్ వ్యయం మొత్తంలో 40 శాతం వరకు ప్రభుత్వ సబ్సిడీ, మిగిలింది బ్యాంకు రుణంగా నిర్ణయించింది. మార్చి 22లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. తొలుత మార్చి నెలాఖరికి యూనిట్లను గ్రౌండ్ చేయాలని భావించగా ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ రావడంతో మే నెలాఖరు వరకూ పొడిగించింది. ఎంపిక చేసిన వారికి మార్చి చివరి వారం నుంచి ఏప్రిల్ మొదటి వారం మధ్యలో ఇంటర్వ్యూలు నిర్వహించిన అధికారులు త్వరలోనే రుణాలు మంజూరవుతాయని చెప్పారు.

కావాల్సిన వారితో జాబితాలు

పేరుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించినప్పటికి లబ్ధిదారుల ఎంపిక అంతా అధికార పక్ష నేతల కనుసన్నల్లోనే జరిగింది. నియోజకవర్గాలకు కేటాయించిన యూనిట్లను పంచుకుని కావాల్సిన వారిని ఎంపిక చేశారు. చాలాచోట్ల సింహభాగం టీడీపీనే తన్నుకుపోయిందన్న అసంతృప్తిలో జనసేన పార్టీ నాయకులు ఉన్నారు. నాయకులు ఓకే చేసినా వారితోనే జాబితాలను సిద్ధం చేశారు. ఒక్కో గ్రామానికి మంజూరైన యూనిట్లు ఐదు నుంచి పదిలోపే ఉండగా దరఖాస్తులు మాత్రం అధిక సంఖ్యలో వచ్చాయి. దీంతో రుణాలు రాని వారి అసంతృప్తి కూటమికి చేటు చేస్తుందన్న ఆలోచనలో ప్రభుత్వ పెద్దలు ఉన్నట్టు తెలుస్తోంది. మరోపక్క ప్రస్తుత 2024–25 ఆర్థిక సంవత్సరానికి కేటాయింపులు చేయగా, మరో రెండు మూడు నెలలు ఆగి వీటినే 2025–26 ఆర్థిక సంవత్సరంగా కేటాయింపులుగా చూపించవచ్చన్న ఆలోచనలో కూడా వారు ఉన్నట్టు సమాచారం. ఏదిఏమైనా ఈపాటికే యూనిట్లు గ్రౌండ్ కావాల్సి ఉండగా రుణాలు ఎప్పుడు వస్తాయో స్పష్టత లేదు. లబ్ధిదారుల జాబితాలను ప్రస్తుతానికి హోల్డ్‌లో ఉంచారు. ప్రభుత్వం నుంచి సబ్సిడీ ఇంకా విడుదల కాకపోవడంతో రుణాల కోసం కొన్నాళ్లు ఆగాలంటూ లబ్ధిదారులకు నాయకులు సమాచారం ఇస్తున్నారు.

కార్పొరేషన్	పథకం	యూనిట్లు	మొత్తం (రూ.కోట్లలో)
ఎస్సీ	ఉన్నతి	120	3.60
ఎస్సీ	జనరల్ కేటగిరీ	714	24.39
బీసీ	స్వయం ఉపాధి సోపానం	1,901	36.50
బీసీ	జనరిక్ మెడికల్	39	3.12
ఈడబ్ల్యూఎస్	స్వయం ఉపాధి సోపానం	215	4.30
ఈడబ్ల్యూఎస్	జనరిక్ మెడికల్	35	2.28
కాపు	చంద్రన్న సోపానం	694	23.31
కాపు	ఎంఎస్ఎంఈ	10	25

వైభవంగా వసంతోత్సవం

ముగిసిన వైశాఖ మాస బ్రహ్మోత్సవాలు



భక్తులపై వసంతాలు చల్లుతున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలు బుధవారం జరిగిన విశేష కార్యక్రమాలతో ముగిశాయి. ఉదయం కల్యాణ మండపంలో అర్చకులు శ్రీవారు, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు అర్చనాది కార్యక్రమాలు జరిపి, హారతులిచ్చారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు వసంతాలు సమర్పించి, చూర్ణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అందులో భాగంగా స్వామిని కీర్తిస్తూ అర్చకులు, మహిళా భక్తులు వడ్లు దంచారు. ఆ తరువాత రాజాధిరాజ వాహనంపై శ్రీవారికి తిరువీధి సేవను నిర్వహించి, భక్తులకు వసంతాలు అందజేశారు. అలాగే రాత్రి ఆలయంలో స్వామి వారికి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవాన్ని అర్చకులు, పండితులు వైభవోపేతంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో శ్రీవారికి రాత్రి ఆలయంలో 12 ప్రదక్షిణలు, 12 సేవా కాలాలు, 12 రకాల పిండి వంటలతో నివేదనలు జరిపారు. శ్రీపుష్ప యాగోత్సవాన్ని వైభవోపేతంగా జరిపారు. ఆలయ ముఖ మండపంలో శయన మహావిష్ణువు అలంకారంలో స్వామివారు దర్శనమిచ్చారు. ఈ వేడుకలతో శ్రీవారి బ్రహ్మోత్సవాలు ముగిశాయి.

నేటి నుంచి ఆర్జిత సేవలు

శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో రద్దు చేసిన నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలను గురువారం నుంచి పునరుద్ధరిస్తున్నట్టు ఆలయ ఈఓ ఎన్వీ సత్యనారాయణమూర్తి తెలిపారు.

అక్రమార్కులకు భీమవరం

- పన్నుల్లో అక్రమాలపై ఇటీవల నలుగురిపై క్రమశిక్షణ చర్యలు
- కోవిడ్ నిధుల స్వాహాపై గతంలోనే విచారణకు ఆదేశించిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- రూ.98 లక్షలు కాజేసినట్టు తాజాగా తేల్చిన విజిలెన్స్ అధికారులు
- ఆరుగురు ఉద్యోగులపై క్రిమినల్ చర్యలకు డీఎంఏ ఆదేశం



భీమవరం మున్సిపల్ కార్యాలయం

సాక్షి, భీమవరం: పట్టణంలోని 9వ వార్డు చినరంగనిపాలెంలో రూ.కోట్లు ఖరీదు చేసే ఖాళీ స్థలానికి సంబంధించి సరైన రికార్డు లేకుండా వేరొకరి పేరు మీద మున్సిపల్ అధికారులు పన్ను సృష్టించేశారు. ఈ వ్యవహారంలో పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయి. స్థల యజమానుల ఫిర్యాదుపై విచారణ జరిపిన ఉన్నతాధికారులు సరైన పరిశీలన చేయకుండా పన్ను వేసినట్టు తేల్చారు. అందుకు బాధ్యులుగా మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసిన ఎస్.శివరామకృష్ణ, రెవెన్యూ అధికారి డి.సోమశేఖర్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎస్.కృష్ణమోహన్, వార్డు సెక్రటరీ పి.చంద్రశేఖర్‌లపై క్రమశిక్షణ చర్యలకు ఆదేశిస్తూ ఏప్రిల్ 17న ప్రిన్సిపల్ సెక్రటరీ ఉత్తర్వులు జారీచేశారు.

కోవిడ్ సమయంలో బాధితులకు వైద్యం సాయం అందించేందుకు గత ప్రభుత్వం పట్టణంలో క్వారంటైన్ సెంటర్లను ఏర్పాటుచేసింది. వీటి నిర్వహణ పేరిట కొందరు మున్సిపల్ అధికారులు అక్రమాలకు తెరలేపారు. కోవిడ్ బాధితులకు సదుపాయాలు కల్పించినట్టుగా నకిలీ బిల్లులు, ఫోర్జరీ సంతకాలతో నిధులను స్వాహా చేశారు. దీనిపై అందిన ఫిర్యాదు మేరకు గత ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. రూ.91.06 లక్షలు అవినీతి జరిగినట్టు తాజాగా విచారణలో తేలింది. అవినీతికి పాల్పడిన నాటి మున్సిపల్ కమిషనర్ కె.రమేష్‌కుమార్ (రిటైర్డ్), ఎఫ్1 సీహెచ్ కామేష్‌బాబు, జూనియర్ అసిస్టెంట్ జీవీఎస్ చంద్రశేఖర్, హెల్త్ అసిస్టెంట్ ఎస్.చంటిబాబు, ఏఈలు వీవీఎస్ శివ కోటేశ్వరరావు, కె.రాజ్‌కుమార్, కాంట్రాక్టర్లు జీవీ సురేష్, ఏ.భగవాన్‌పై క్రిమినల్ చర్యలకు ఆదేశిస్తూ రెండు రోజుల క్రితం డీఎంఏ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు వారిపై మున్సిపాల్టీ నుంచి పట్టణ వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పలు విభాగాల్లో అవినీతి

టౌన్‌ప్లానింగ్, ఇంజినీరింగ్, శానిటేషన్, పబ్లిక్ హెల్త్ తదితర విభాగాల్లో అవినీతి రాజ్యమేలుతోందన్న ఆరోపణలు ఉన్నాయి. పట్టణంలో నిబంధనలకు విరుద్ధంగా యథేచ్ఛగా నిర్మాణాలు చేస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తుండటం, పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించిన సామగ్రి కొనుగోళ్లు, వాహనాలకు డీజిల్, మెయింటినెన్స్‌లో అవకతవకలు, చేయని పనులకు చేసినట్టుగా బిల్లులు పెట్టుకుని ప్రజాధనాన్ని కాజేయడం, పనుల అంచనాలు పెంచేయడం, వేసవి సందర్భంగా పట్టణ ప్రజలకు ట్యాంకర్లు ద్వారా తాగునీటి సరఫరా పేరిట బయట అమ్మకాలు చేసుకోవడం తదితర అవినీతి వ్యవహారాలపై ఇప్పటికే స్థానికుల నుంచి పలు ఫిర్యాదులు వెళ్లినట్టు తెలుస్తోంది. అవి వెలుగుచూస్తే మరిన్ని అక్రమాలు బయటపడతాయని అంటున్నారు.

పాలకవర్గం లేక పెచ్చుమీరుతున్న అవినీతి

భీమవరం మున్సిపాలిటీ ఘన చరిత్రను కొందరు ఉద్యోగులు తమ అవినీతి వ్యవహారాలతో మసకబారుస్తున్నారు. ప్రత్యేక పాలన, ప్రశ్నించేవారు లేకపోవడాన్ని ఆసరాగా చేసుకుని దొరికినకాడికి దోచేస్తున్నారు. 2014లో చివరిగా మున్సిపాల్టీకి ఎన్నికలు జరిగాయి. తర్వాత 2019లో ఎన్నికలు జరగాల్సి ఉంది. పట్టణ సమీపంలోని చిన అమిరం, రాయలం, కొవ్వాడ అన్నవరం, విస్సాకోడేరు, తాడేరు తదితర గ్రామాల విలీన ప్రతిపాదనపై ఆయా గ్రామాల వారు కోర్టుకు వెళ్లడం తదితర కారణాలతో ఎన్నికలు జరగలేదు. నాటి నుంచి ప్రత్యేక పాలన కొనసాగుతోంది. కౌన్సిలర్లు, పాలకవర్గం, సమస్యలపై గళమెత్తే ప్రతిపక్షం లేకపోవడంతో ఉద్యోగుల ఇష్టారాజ్యంగా మారింది. కొందరు ఉద్యోగులు స్థానికంగా పాతుకుపోయారు. రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు ఏర్పరుచుకుని ఎక్కడికి బదిలీ అయినా వారి సిఫార్సులతో తిరిగి ఇక్కడ వాలిపోతున్నారు. వారి అండదండలతో 'లోకల్' అంటూ పెత్తనం చెలాయిస్తూ పై అధికారుల ఆదేశాలను ఖాతరుచేయడం లేదని తెలుస్తోంది.

మాక్‌డ్రిల్‌తో అప్రమత్తం



భీమవరం కొత్త బస్టాండ్‌లో మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న కలెక్టర్ నాగరాణి, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

భీమవరం (ప్రకాశంచౌక్): మాక్‌డ్రిల్ అవగాహన అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవడంతోపాటు, ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడానికి ఉపయోగంగా ఉంటుందని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అనుకోని ప్రమాదాలు సంభవించినప్పుడు ఏ విధంగా స్పందించాలి, ఏ విధంగా తమను తాము రక్షించుకోవాలి అనే అంశాలపై ఎస్డీఆర్ఎఫ్, అగ్నిమాపక, పోలీస్, రెవెన్యూ, వైద్య శాఖలు సంయుక్తంగా బుధవారం భీమవరం కొత్త బస్టాండ్ ఆవరణలో కలెక్టర్, ఎస్పీ అద్నాన్ నయీం అస్మి సమక్షంలో మాక్ డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిలెండర్ నుంచి గ్యాస్ లీకేజీని, మంటలను ఎలా కట్టడి చేయిచ్చో కలెక్టర్ స్వయంగా చేసి చూపించారు. ఎస్పీ మాట్లాడుతూ అనుకోని సంఘటనలు జరిగినప్పుడు అనేక అనర్థాలు జరుగుతాయని, ఇలాంటి మాక్‌డ్రిల్స్ ద్వారా ప్రజలకు అవగాహన కలిగించి ప్రమాదాల బారి నుంచి బయటపడవచ్చన్నారు. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఏ.శ్రీనివాసరావు ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించారు. డీఆర్వో మొగిలి వెంకటేశ్వర్లు, అడిషనల్ ఎస్పీ వి.భీమారావు, ఆర్డీవో కే ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఎర్రకాలువ తవ్వేశారు



వేగవరం ఎర్రకాలువ జలాశయం గర్భంలో ఏర్పడిన భారీ గోతులు





ఎర్రకాలువ జలాశయం సమీపంలో పొలాల్లో దాచిన జేసీబీ

జంగారెడ్డిగూడెం: మట్టి మాఫియా ఎర్రకాలువ జలాశయం గర్భంలో భారీగా తవ్వేసి మట్టిని తరలించేశారు. జలాశయం గర్భాన్ని తెగ తవ్వేశారు. దీంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. ఈ మట్టి మాఫియా ప్రధాన సూత్రదారి జంగారెడ్డిగూడెం మండలం వేగవరానికి చెందిన టీడీపీ నాయకుడు. అంతా తానై ఎర్రకాలువ జలాశయం గర్భాన్ని తవ్వేసి మట్టిని అమ్మేసుకుంటున్నారు. గత కొద్ది రోజులుగా రాత్రి సమయాల్లో జేసీబీ పెట్టి తవ్వేసి సొమ్ము చేసుకుంటున్నారు. పగలు జేసీబీని సమీపంలోని పొలాల్లో పెట్టి.. రాత్రి మట్టి తవ్వేసి యథేచ్ఛగా తరలించేస్తున్నారు. ఎర్రకాలువ జలాశయం గర్భంలో మట్టిని తవ్వేసి తరలించేస్తున్నారని సంబంధిత శాఖ అధికారులకు సమాచారం ఇచ్చినా అధికారులు స్పందించడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇటీవల కొంతమంది దీనిపై ఆయా శాఖల అధికారులకు సమాచారం ఇచ్చినా స్పందించలేదు. ఇరిగేషన్ శాఖ అధికారులు కూడా దీనిపై స్పందించడం లేదు. మట్టి తరలిస్తున్నారని ఇరిగేషన్ కింది స్థాయి అధికారికి చెప్పినా పట్టించుకోవడం లేదంటున్నారు. క్షేత్రస్థాయిలో నిత్యం జలాశయాన్ని పరిశీలించాల్సిన అధికారి జలాశయం పరిధిలో ఏం జరుగుతుందో కూడా తెలియని పరిస్థితి. చేపలు పట్టేందుకు మత్స్యకారులు, పశువుల్ని కడిగేందుకు పశువుల కాపరులు ఈ జలాశయంలోకి దిగుతుంటారు. భారీ గోతులు వీరి ప్రాణాలకు ముప్పుగా పరిణమించాయి.

సైబర్ కేసును ఛేధించిన పోలీసులు



కేసు వివరాలు వెల్లడిస్తున్న గూడెం పోలీసులు

తాడేపల్లిగూడెం: సైబర్ మోసం కేసును గూడెం పట్టణ పోలీసులు ఛేధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని కొబ్బరితోటకు చెందిన పోపూరి సాంబశివప్రసాద్‌ను కొందరు డిజిటల్ అరెస్టు అంటూ ఫోన్‌లో బ్లాక్‌మెయిల్ చేశారు. ప్రసాద్ వద్ద నుంచి రెండు బ్యాంకు శాఖల ద్వారా రూ.50 లక్షలు బదిలీ చేయించుకున్నారు. తనను కొందరు మోసం చేశారని గ్రహించిన ప్రసాద్ గూడెం పోలీసులను ఆశ్రయించారు. ఎస్పీ ఆదేశాల మేరకు సీఐ ఎ.సుబ్రహ్మణ్యం నేతృత్వంలో ఎస్సై బాదం శ్రీనివాసు, సిబ్బంది రాజస్థాన్ వెళ్లి నిందితులను అరెస్టు చేశారు. రాజస్థాన్‌లోని జలోర్ జిల్లా బాగోడా మండలం బాలనికి చెందిన హనుమాన్‌రామ్, బార్మర్ జిల్లా సోనారి గ్రామానికి చెందిన దినేష్‌ను అరెస్టు చేశారు. నిందితులు రాజస్థాన్‌లోని ఒక పెట్రోలు బంకు ఓనర్ పీఓఎస్ మిషన్ నుంచి రూ.7 లక్షలు తీసుకున్నట్లు విచారణలో తేలింది. ఈ కేసులో అప్రమత్తమైన పోలీసులు బ్యాంకు అధికారుల ద్వారా రూ.10 లక్షలు హోల్డ్‌లో పెట్టించి, రూ.20 లక్షల ఎఫ్‌డీలు బ్రేక్ అవ్వకుండా చేశారు. ఈ విషయంలో కీలకంగా వ్యవహరించిన హెచ్‌డీఎఫ్‌సీ మేనేజర్‌ను ఎస్పీ అభినందించారు.

రామశింగవరంలో భూకేటాయింపు నిలిపివేత

సాక్షి, అమరావతి: ఏలూరు జిల్లా పెదవేగి మండలం రామశింగవరంలో ఏపీఐఐసీకి 173.60 ఎకరాల భూమిని కేటాయిస్తూ 2017లో జారీ చేసిన జీఓను ప్రభుత్వం తాత్కాలికంగా నిలిపివేసింది. ఈ భూమి అటవీ శాఖ నియంత్రణలోని పంచాయతీ అటవీ భూమిగా గుర్తించిన నేపథ్యంలో అటవీ (సంరక్షణ) చట్టం, 1980 ప్రకారం కేంద్ర ప్రభుత్వ అనుమతి వచ్చే వరకు కేటాయింపును నిలిపివేయాలని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి ఉత్తర్వులిచ్చారు. జిల్లా కలెక్టర్ నివేదిక ప్రకారం 2017లోనే ఏపీఐఐసీకి భూమి అప్పగించినా అటవీ శాఖ దాన్ని తమ ఆధీనంలో ఉన్నట్లు తెలిపి అభ్యంతరం వ్యక్తం చేసింది.

సీట్లు పాయె.. నిధులు రావాయె

- ఇన్‌చార్జిల పాలనతో అస్తవ్యస్తంగా నిట్
- తగ్గిన సీట్లు.. ఆగిన నియామకాలు
- వెనక్కి వెళుతున్న ప్రగతి

తాడేపల్లిగూడెం: ఇన్‌చార్జిల పాలన, బోర్డు ఆఫ్ గవర్నెన్స్ ఇష్టారాజ్యం కారణంగా ప్రతిష్టాత్మకమైన తాడేపల్లిగూడెం ఏపీ నిట్ (నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో విద్యార్థుల భవితవ్యం మసకబారుతోంది. ప్రారంభంలో నిట్‌లో ఉన్న సీట్ల సంఖ్య భారీగా తగ్గించేయడంతో ఇక్కడి విద్యార్థులు మూల్యం చెల్లించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వరంగల్ నిట్ మెంటార్‌గా ఉన్న సమయంలో నిధులు వచ్చాయి. ఇన్‌చార్జి డైరెక్టర్లు ఆరంభ సమయంలో తాత్కాలిక భవనంలో పనిచేసినప్పుడు నిధులు వచ్చాయి. తొలి రెగ్యులర్ డైరెక్టర్ వచ్చాక రూ.400 కోట్లకు పైగా వెచ్చించి పక్కా భవనాలు నిర్మించారు. సీట్ల సంఖ్య కూడా 480 నుంచి 750కు పెరిగింది. అనంతరం నిట్‌పై అవినీతి మరకలు పడ్డాయి. తొలి డైరెక్టర్ సస్పెండయ్యారు. ఇక ఇన్‌చార్జిల పాలన, బోర్డు ఆఫ్ గవర్నెన్సు ఇష్టారాజ్యంగా సాగింది. సీట్లు పోయినా అడిగే వారు లేరు. కేంద్ర ఉన్నత విద్యాశాఖను ప్రశ్నించేవారు కరువయ్యారు. కొంత కాలం ఇన్‌చార్జి డైరెక్టర్ పాలనలో ఇక్కడ తిష్టవేసిన ఆ నలుగురిదే రాజ్యం అన్నట్టుగా సాగింది. గతంలో ఇక్కడ మెంటార్‌గా వ్యవహరించిన డాక్టర్ ఎన్‌వీ రమణరావు ఇన్‌చార్జి డైరెక్టర్‌గా వచ్చారు. దీంతో నిట్ కాస్త గాడిలో పడ్డట్టు కనిపించినా, వెనక్కి పోయినా సీట్లు ఇంకా రాలేదు. నిధుల కోసం ప్రతిపాదనలు పంపినా ప్రస్తుతం ఏపీ నిట్ పరిస్థితి ఉన్న సీట్లు పాయె. నిధులు రావాయె అన్నట్టుగా తయారయ్యింది.


తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్

సీట్ల కుదింపు

శాశ్వత ఫ్యాకల్టీ, టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది లేని సమయంలో ఏపీ నిట్‌లో సీట్ల సంఖ్య 750 ఉంది. సూపర్ న్యూమరరీ సీట్లు కేటాయింపు జరిగినా, అవి ఏపీ నిట్‌కు వచ్చేవి. ఏపీ నిట్‌లో తొలి డైరెక్టర్ సస్పెండ్ కావడాన్ని కేంద్ర ఉన్నత విద్యాశాఖలో బూచిగా చూపించడంలో అక్కడ అప్పట్లో ఏలిన ఆ నలుగురు కృతకృత్యులయ్యారు. బోర్డు ఆఫ్ గవర్నెన్స్‌కు ఇది వరంగా మారింది. సీట్లను తగ్గిస్తామన్నా.. ఇన్‌చార్జి డైరెక్టర్‌గా ఆ సమయంలో ఉన్న వారు అభ్యంతరం చెప్పలేదు. దీంతో బోర్డు ఆఫ్ గవర్నెన్సు ఏపీ నిట్‌లోని సంఖ్యను 750 నుంచి 480 కు తగ్గించారు. ఏడాదిన్నర దాటుతున్నా, ఇంకా సీట్లు 480 వద్దే ఉండిపోయాయి.

ఫ్యాకల్టీలు వచ్చినా పెరగని సీట్లు

శాశ్వత ఫ్యాకల్టీల నియామకం కోసం గత ఆగస్టులో నోటిఫికేషన్ ఇచ్చారు. 25 మందికి గాను 16 మంది ఫ్యాకల్టీలు వచ్చారు. అదే సమయంలో బోధనా సిబ్బంది 125 మందిని రిక్రూట్‌మెంటు చేసుకోవడం కోసం నోటిఫికేషన్ ఇచ్చారు. పూర్తిస్థాయి డైరెక్టర్ లేరన్న ఒకే ఒక్క కారణంతో భర్తీ ప్రక్రియకు శ్రీకారం చుట్టలేదు. నాన్ టీచింగ్ పోస్టుల భర్తీ కూడా ఇదే దారిలో నడిచింది. అంతిమంగా ఈ విద్యాసంవత్సరంలో అదనంగా రావాల్సిన, కోల్పోయిన 270 సీట్లు రాకుండా పోయాయి.

పనులకు మోక్షం ఎప్పుడో..

నిట్ శాశ్వత భవనాల నిర్మాణంలో భాగంగా తొలిదశ పనులను ఏ, బీ కింద విభజించి రూ.400 కోట్ల పైబడి నిధులు వెచ్చించి పనులు పూర్తి చేశారు. కెనరా బ్యాంకు ద్వారా హయ్యర్ ఎడ్యుకేషన్ ఫైనాన్షియల్ అసిస్టెన్సు(హెఫా) ద్వారా రూ.428 కోట్లకు ప్రతిపాదనలు పంపించారు. వీటిలో రూ.70 లక్షలతో పరిశోధనా పరికరాలకోసం ప్రతిపాదించారు. బాలురు వసతి గృహం, బాలికల హాస్టల్, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ సెల్, ఇన్నోవేషన్ అండ్ ఇంక్యుబేషన్ సెంటర్, రీసెర్చ్ పార్కు, డిపార్టుమెంటు బిల్డింగ్, ఇంటర్నేషనల్ విద్యార్థుల వసతి గృహం, ఫ్యాకల్టీ, నాన్ ఫ్యాకల్టీ క్వార్టర్స్ నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపించారు. ఆ పనులకు ఎప్పుడు మోక్షం కలుగుతుందో వేచి చూడాల్సిందే.

సీట్లు, నిధులు వస్తాయి

ఏపీ నిట్‌లో ప్రస్తుతానికి సీట్ల సంఖ్య 480కి తగ్గినా త్వరలోనే మిగిలిన 270 సీట్లు తిరిగివస్తాయి. నిర్మాణాల కోసం పంపించిన ప్రతిపాదనల సొమ్ములు ఆరు నెలల్లో వస్తాయని భావిస్తున్నాం.

–దినేష్ రెడ్డి, ఏపీ నిట్ రిజిస్ట్రార్

క్లుప్తంగా

ముగిసిన జిల్లాస్థాయి చదరంగం పోటీలు


అండర్‌-11 జిల్లా స్థాయి చదరంగ పోటీల విజేతలను అభినందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ప్రతిభ స్కూల్ నందు శ్రీ హంస చెస్ అకాడమీ, ఏలూరు జిల్లా అడ్‌హక్ కమిటీ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి అండర్ 11 బాల బాలికల చదరంగ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ పోటీల్లో బాలుర విభాగంలో యడ్ల జ్యోతి స్వరూప్, కుకునూరి తశ్విన్, బాలికల విభాగంలో యడ్ల ప్రేమ్ రక్షిత, వేగేశ్న ఇషిత సాయిశ్రీ విజేతలుగా నిలిచినట్లు టోర్నమెంట్ డైరెక్టర్ కన్నా సూర్య నాగేశ్వరరావు తెలిపారు. విజేతలు ఈ నెల 24, 25 తేదీల్లో గుంటూరులో జరిగే అండర్ 11 స్టేట్ చెస్ చాంపియన్ షిప్‌కి ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ప్రతిభ స్కూల్ ప్రిన్సిపాల్ సరోజ రెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణ రెడ్డి, అయినపర్తి చంద్రశేఖర్, టోర్నమెంట్ చీఫ్ ఆర్బిటర్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో భారతీయ విద్యాభవన్స్ ప్రతిభ


ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

భీమవరం: సీబీఎస్ఈ పరీక్షా ఫలితాల్లో భారతీయ విద్యా భవన్స్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారని భవన్స్ చైర్మన్ ఉద్దరాజు కాశీ విశ్వనాధరాజు, సెక్రటరీ ఎస్ శ్రీరామరాజు చెప్పారు. టెన్త్ పరీక్షల్లో సీహెచ్ ఎంవీ శ్రీకార్తిక్ 488 మార్కులు, ఆర్ సాయిశ్రీరామ్ 482, ఎస్ కీర్తన 482, సాయి పి పాండ 471 మార్కులు సాధించారన్నారు. సీబీఎస్ఈ +2 (ఇంటర్)లో కె హంసిక 477 మార్కులతో జిల్లాలో ప్రథమస్థానంలో నిలవగా వీఎల్ చెక్రిష్ 459, ఎ ఆదర్శ్ 456, జి ప్రణీత్ వర్మ 410, చిరాగ్ అగర్వాల్ 407, కె ధర్మతేజ 394 మార్కులు సాధించినట్లు చెప్పారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నడుస్తున్న భీమవరం, పాలకొల్లు, తాడేపల్లిగూడెం, రాజమహేంద్రవరం స్కూల్స్‌లో విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. బుధవారం భీమవరం ఆనంద ఫంక్షన్ హాల్లో జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సహకారంతో ఏర్పాటు చేసిన సభలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను భవన్స్ యాజమాన్యం అభినందించింది. కార్యక్రమంలో కొత్త శ్రీనివాస్, ఎం.సత్యనారాయణమూర్తి, రఘుపతి రాజు, ప్రిన్సిపాల్ సురేష్ బాలకృష్ణన్, వైస్ ప్రిన్సిపాల్ పద్మ, పవన్, కంతేటి వెంకటరాజు తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే గర్భిణీ మృతి


పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణీ శిరీష మృతదేహం


ఘటనపై విచారణ చేస్తున్న అధికారులు

మృతురాలి బంధువుల ఆరోపణ

పోలవరం రూరల్: పోలవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో సకాలంలో వైద్యం అందక ఒక నిండు గర్భిణీ మృత్యువాత పడింది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే గర్భిణీ మృతి చెందినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. పోలవరం మండలం కొత్తకుంకాల గ్రామానికి చెందిన తామ శిరీష (25) గర్భిణి. మంగళవారం రాత్రి నొప్పులు రావడంతో ఆటోలో ఆమెను భర్త పోలవరం వైద్యశాలకు తీసుకువచ్చారు. ఆ సమయంలో వైద్యాధికారి లేకపోవడంతో సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. ఆమె పరిస్థితి విషమంగా ఉందని, రాజమంత్రి ఆసుపత్రికి తరలించాలని అంబులెన్స్ ఎక్కించగా, పరిస్థితి విషమించి ఆమె అంబులెన్స్‌లో మృతిచెందింది. షుగర్ లెవల్స్ పెరగడంతో మృతిచెందిందని వైద్యాధికారులు పేర్కొన్నారు. వైద్యాధికారి నిర్లక్ష్యానికి ఒక గిరిజన గర్భిణీ మృతి చెందిందని కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో వైద్యాధికారులు వైద్యం అందించక పోవడంతేనే ఈ ఘటన జరిగిందనే విషయం ప్రాథమిక దర్యాప్తులో తేలిందని జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి డాక్టర్ పాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయంలో పూర్తిస్థాయి విచారణకు ఆదేశిస్తామన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. మృతురాలు శిరీషకు రెండేళ్ల పాప ఉంది. ఐటీడీఏ పీవో నాయక్ కూడా వైద్యశాలను పరిశీలించి ఘటనపై విచారణ నిర్వహించారు.

పోలవరంలో భారీ చోరీ

25 కాసుల బంగారం, నాలుగు కేజీల వెండి, రూ. 8.60 లక్షల నగదు అపహరణ


చోరీ జరిగిన ఇంటిని డాగ్ స్క్వాడ్‌తో పరిశీలిస్తున్న సీఐ బాలసురేష్‌బాబు

పోలవరం రూరల్: పోలవరంలో తాళాలు వేసి ఉన్న ఇంట్లో భారీ దొంగతనం జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పోలవరం గ్రామానికి చెందిన పద్మనాభుని శ్రీనివాసు గుప్త బరన్ వ్యాపారి. మంగళవారం ఉదయం ఆయన భార్యతో కలిసి రాజమండ్రి ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం వెళ్లారు. తిరిగి రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వచ్చి తాళాలు తీసి చూడగా, బీరువా తాళాలు బద్దలు కొట్టి ఉన్నట్లు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనాస్థలాన్ని డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్‌బాబు పరిశీలించారు. అలాగే చుట్టుపక్కల వారిని విచారించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌తో పరిశీలించారు. గుర్తు తెలియని దుండగుడు ఇంటి వెనుక వైపు ఉన్న తలుపు గుండా ప్రవేశించి బీరువాలోని లాకర్ తాళాలు బద్దలు కొట్టి 25 కాసుల బంగారం, నాలుగు కేజీల వెండి, రూ.8.60 లక్షల నగదును అపహరించినట్లు పోలవరం ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

విద్యార్థినిపై లైంగిక దాడి.. పోక్సో కేసు నమోదు

ఏలూరు టౌన్: నగరంలో ఇంటర్ విద్యార్థినిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. ఏలూరు టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని ఒక ప్రాంతానికి చెందిన బాలిక(16) ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పూర్తి చేసింది. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో ఇంటి వద్దే ఉంటుంది. టూటౌన్ పరిధిలోని కబడ్డీ కాలనీకి చెందిన కర్నాడ రాజు (23) గత కొంతకాలంగా ఆమెతో సన్నిహితంగా ఉంటున్నాడు. రాజుకు వివాహమై భార్యకు విడాకులు ఇచ్చాడని విద్యార్థిని తల్లి చెప్పడంతో ఆమె అతడి నుంచి దూరంగా ఉంటుంది. ఈనెల 13వ తేదీ సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన బాలికకు రాజు మాయమాటలు చెప్పి తన ఇంటికి తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అక్కడ నుంచి తప్పించుకుని వచ్చిన బాలిక విషయాన్ని తల్లికి చెప్పింది. దీనిపై బాలిక తల్లి ఏలూరు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక..

ఏలూరు (టూటౌన్): ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు రూరల్ మండలం మెరక కాట్లంపూడి గ్రామానికి చెందిన నంబూరు అశోక్ కుమార్ (37) ఆటో నడుపుకుంటూ జీవిస్తున్నాడు. అతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. సొంత ఇంటి నిర్మాణం నిమిత్తం బ్యాంకులో రుణం తీసుకున్నాడు. అయితే ఆర్థిక ఇబ్బందులతో రుణం తిరిగి చెల్లించకపోవడంతో బ్యాంకు అధికారులు ఒత్తిడి తెచ్చారు. దీంతో బుధవారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని ఏలూరు సర్వజన ఆస్పత్రికి తరలించి ఏలూరు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంతా గప్‌చుప్

- 'సాక్షి' కథనంతో కూటమి నేతల్లో కలకలం
- గ్రావెల్ తవ్వుతున్న ప్రాంతాల నుంచి పొక్లెయిన్‌ల తొలగింపు


ఎం.నాగులపల్లి వద్ద తవ్వకాలతో ఏర్పడిన భారీ గోతులు

సాక్షి స్పందన

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి, పంగిడిగూడెం పోలవరం కుడి కాలువ గట్టుపై గ్రావెల్ అక్రమ తవ్వకాలపై సాక్షి దినపత్రికలో 'హద్దు మీరిన మట్టి దందా' శీర్షికతో బుధవారం ప్రచురితమైన కథనం కూటమి నేతల్లో కలకలాన్ని రేపింది. గ్రావెల్ క్వారీ గోతుల్లోని పొక్లెయిన్‌లను ఉదయం హడావిడిగా బయటకు తీసి, అనుమతులున్న మట్టి గుట్టల వద్ద ఉంచారు. అక్రమార్కులు మొదట్లో గట్టుపై ఉన్న కాలువ మట్టిని తవ్వుకుని, అమ్ముకునేవారు. మట్టికంటే ఎర్ర గ్రావెల్‌కు డిమాండ్, ధర ఎక్కువగా ఉండటంతో భీమడోలు మండలం సూరప్పగూడెంకు చెందిన ఓ జనసేన నాయకుడు గట్టుపై గోతులు తవ్వి గ్రావెల్‌ను అమ్మడం మొదలు పెట్టాడు. పచ్చ నేతలు సైతం అతడి బాటే పట్టారు. ఇంకేముంది నచ్చిన చోట, ఇష్టం వచ్చినట్టుగా తవ్వకాలు జరిపారు. అయితే సాక్షి కథనంతో గ్రావెల్ తవ్వకాలకు బ్రేక్ పడటంతో, మట్టి తవ్వకాలు మందకోడిగా సాగాయి. ఇప్పటి వరకు నిత్యం 70 నుంచి 80 టిప్పర్ల మట్టి బయటకు వెళ్లగా, బుధవారం మాత్రం కేవలం 17 నుంచి 25 టిప్పర్ల మట్టి మాత్రమే రవాణా అయ్యింది. ఎర్ర గ్రావెల్ అయితేనే తాము కొంటామని టిప్పర్ల యజమానులు చెబుతున్నారట. కాగా కాలువ గట్టుపై ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పార్టీ నేతలకు భయపడి ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. దాంతో క్వారీ గోతులను ఎవరు పూడుస్తారని స్థానిక రైతులు ప్రశ్నిస్తున్నారు.

కారు బోల్తా పడి ఐదుగురికి గాయాలు


క్షతగాత్రులకు సహాయం అందజేస్తున్న స్థానికులు

కొయ్యలగూడెం: కారు అదుపు తప్పి బోల్తా పడిన ఘటనలో ఐదుగురికి గాయాలయ్యాయి. కొయ్యలగూడెం సమీపంలోని బీఈడీ కళాశాల వద్ద నేషనల్ హైవేపై బుధవారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుంది. కృష్ణా జిల్లా గంపలగూడెం గ్రామం నుంచి కాకినాడ పెళ్లి చూపులకు కారులో వెళుతుండగా కొయ్యలగూడెం సమీపంలోని బీఈడీ కళాశాల వద్ద జాతీయ రహదారిపై వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో కారును తప్పించబోయి అదుపుతప్పి బోల్తా కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో కొయ్యలగూడెం పీహెచ్‌సీకి తరలించారు.

శోకసంద్రంలో వేగివాడ


నేతల సాగర్ (ఫైల్)


నేతల అజయ్ (ఫైల్)


చొక్కా అభిలాష్ (ఫైల్)

పెదవేగి: మండలంలోని వేగివాడ శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబానికి ఆధారమైన ముగ్గురు యువకులు ప్రమాదవశాత్తూ చెరువులో పడి మృతి చెందడంతో ఆ కుటుంబాలకు తీరని శోకం మిగిలింది. వేగివాడకు చెందిన నేతల అజయ్, చొక్కా అభిలాష్, నేతల సాగర్, నున్నా ప్రేమ్‌కుమార్ (చింటు), నేతల హర్ష బుధవారం భీమడోలులో ఓ కార్యక్రమానికి వెళ్లారు. వీరిలో నేతల అజయ్ (30), నేతల సాగర్ (22), చొక్కా అభిలాష్ (19) ప్రమాదవశాత్తూ కోమటికుంట చెరువులో దిగి మృత్యువాత పడ్డారు. నేతల అజయ్‌కు భార్య ప్రమీల, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబానికి అతడే ఆధారం కాగా ఇప్పుడు తమ పరిస్థితి ఏంటని కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడటంతో చొక్కా అభిలాష్ తల్లిదండ్రులు ఇమ్మానియేల్, హిమబిందు గుండెలవిసేలా రోదిస్తున్నారు. సాగర్ కుటుంబ పరిస్థితి మరీ దయనీయం. అతడికి తల్లిదండ్రులు లేరు. ఇద్దరు అక్కలతో కలిసి నివసిస్తూ కూలి పనులకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆ ఇద్దరు అక్కల్లో ఒకరికి భర్త లేకపోగా మరో అక్క దివ్యాంగురాలు. సోదరుడి అకాల మరణం తమ జీవితాలను ప్రశ్నార్థకంగా మార్చేసిందని ఆ సోదరీమణులు గుండెలు బాదుకుంటున్నారు.

మూర్ఛ వ్యాధితో యువకుడి మృతి


ఆచవరం రైల్వేగేట్ సమీపంలో మృతి చెందిన గుర్తు తెలియని యువకుడు

కైకలూరు: గుర్తుతెలియని యువకుడు మూర్ఛ వ్యాధితో మృతి చెందిన ఘటన కైకలూరు మండలం ఆచవరం రైల్వే గేటు సమీపంలో బుధవారం జరిగింది. టౌన్ సీఐ పి.కృష్ణ తెలిపిన వివరాల ప్రకారం కైకలూరు నుంచి కోరుకొల్లు వైపు వెళ్లే మెయిన్ రోడ్డు పక్కన ఆచవరం రైల్వే గేట్ దాటిన తర్వాత ఖాళీ స్థలంలో గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించామన్నారు. మృతుడి వయస్సు 25 నుంచి 30 సంవత్సరాలు ఉంటుందన్నారు. దీనిపై విచారించగా ఓ వ్యక్తికి ఫిట్స్ రాగా చుట్టుపక్కల వారు అతనికి పరిచర్యలు చేశారన్నారు. అనంతరం 108కి కాల్ చేయగా సిబ్బంది వచ్చి పరీక్షించి చనిపోయినట్లు చెప్పారని సీఐ చెప్పారు. మృతుడు బ్లూ రంగు టీ షర్ట్, షాట్ ధరించి ఉన్నాడన్నారు. అతని కుడి చేయి మీద 'అమ్మ' అని పచ్చబొట్టు ఉందన్నారు. వివరాలు తెలిసిన వారు 94407 96434, 94407 96433 నంబర్లలో సంప్రదించాలన్నారు.

సారా నిర్మూలనకు ప్రత్యేక చర్యలు


కేవీ నాగప్రభుకుమార్

నూజివీడు: జిల్లాలో నూజివీడు, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, పోలవరం నియోజకవర్గాల్లో సారా తయారీ అధికంగా ఉందని ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కేవీ నాగప్రభు కుమార్ తెలిపారు. సారా నిర్మూలనకు నవోదయం-2 కింద ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. స్థానిక ఎక్సైజ్ స్టేషన్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ నిరంతరం సారా బట్టీలపై దాడులు, ఎక్సైజ్ పాత నేరస్తులను బైండోవర్ చేయడం, సారా తయారీ గ్రామాల్లో కమిటీలు వేసి సారా నిర్మూలనకు చర్యలు తీసుకున్నామన్నారు. నూజివీడు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 47 సారా తయారీ గ్రామాలను గుర్తించామన్నారు. ఆయా గ్రామాల్లో సారా వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తూ మార్పు తీసుకువస్తున్నామన్నారు. ఇప్పటివరకు ఎక్సైజ్ పాత నేరస్తులు 317 మందిని బైండోవర్ చేశామన్నారు. ఎక్సైజ్ సీఐ ఏ మస్తానయ్య ఉన్నారు.

కొబ్బరి చెట్టుపై పిడుగు


పిడుగు పడి కొబ్బరి చెట్టు కాలిపోతున్న దృశ్యం

దెందులూరు: కొవ్వలి గ్రామంలోని రాజుల పేటలో ఉన్న కనకమ్మ ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుపై బుధవారం ఉదయం పిడుగు పడింది. ప్రశాంతంగా ఉండే పల్లెటూరులో ఒక్కసారిగా పెద్ద శబ్దం రావడంతో సమీప ఇళ్లలోని ప్రజలు బెంబేలెత్తి పరుగులు తీశారు. కొబ్బరి చెట్టు కాయలు కాలిపోవడం తప్ప ఎటువంటి నష్టం జరగకపోవడంతో ఇంటి యజమాని, గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు.

భూసార పరీక్షలతో చేనుకు చేవ


సూరేపల్లిలో మట్టి నమూనాలు సేకరిస్తున్న దృశ్యం

ముసునూరు: భూసార పరీక్షలతో చేనుకు చేవ, రైతులు లాభం పొందవచ్చని జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ బాషా సూచించారు. మండలంలోని సూరేపల్లిలో ఆర్ఎస్‌కే వద్ద బుధవారం మట్టి నమూనా సేకరించు విధానంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మట్టి నమూనా సేకరణ, భూసార పరీక్షల వల్ల లాభాలను రైతులకు వివరించారు. మండలంలో 1200 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం కాగా ఇప్పటికి 600 నమూనా సేకరణలు పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.చిన సూరిబాబు, ఏఈఓ రామకృష్ణ, వీహెచ్ఏలు, రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దివ్యాంగుల పిల్లలను గుర్తిద్దాం



కరపత్రాలను ప్రదర్శిస్తున్న బాల ఈశ్వరయ్య

తాడేపల్లిగూడెం (టీఓసీ): దివ్యాంగుల పిల్లలను గుర్తిద్దామని భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాల ఈశ్వరయ్య అన్నారు. దివ్యాంగుల పిల్లలు గుర్తింపు కార్యక్రమంలో భాగంగా వీకర్స్ కాలనీ అంగన్వాడీ టీచర్స్‌కు, గ్రామ సచివాలయం సిబ్బందికి బుధవారం కరపత్రాలు అందజేశారు. బాల ఈశ్వరయ్య మాట్లాడుతూ బడి వయస్సు ఉన్న పిల్లలను గుర్తించాలని, వారిని పాఠశాలలో చేర్చి పేర్లు నమోదు చేయించాలన్నారు. సమగ్ర శిక్ష ద్వారా దివ్యాంగుల పిల్లలకు భవిత కేంద్రంలో కల్పిస్తున్న ఉచిత సదుపాయాలను దివ్యాంగుల పిల్లల తల్లిదండ్రులకు తెలియజేసి పథకాలను అందరికి అందేలా కృషి చేద్దామన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ దేవి, వేణి తదితరులు పాల్గొన్నారు.

అంకాలమ్మ వారికి చలిమిడి, పానకాలు



విశేష అలంకరణలో అంకాలమ్మ అమ్మవారు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కొండ్రుప్రోలు గ్రామంలో అంకాలమ్మ జాతర మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారికి చలిమిడి పానకాలు సమర్పించారు. అలాగే, చీరలు, గాజులు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. కాగా, రాత్రి ఆలయం వద్ద కోలాట నృత్య ప్రదర్శన నిర్వహించారు. భక్తులు విరివిగా పాల్గొని కోలాట నృత్యప్రదర్శనను తిలకించారు. ఆలయ కమిటి సభ్యులు బండి గణపతి, పులమోలు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రూట్స్ విద్యార్థుల ప్రతిభ



తణుకు రూట్స్‌స్కూల్‌లో ప్రతిభకనబర్చిన విద్యార్థిని అభినందిస్తున్న స్కూల్‌యాజమాన్యం

తణుకు అర్బన్: ఏపీ పాలిసెట్ ఫలితాలలో రూట్స్ స్కూల్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబర్చి 120/120 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో మొదటి మార్కు సాధించారని స్కూల్ ప్రిన్సిపాల్ ఎల్‌కే త్రిపాఠి బుధవారం ప్రకటనలో తెలిపారు. రూట్స్ స్కూల్‌కి చెందిన అడిన యస్వంత్‌పవన్‌సాయిరామ్ 120/120 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 18వ ర్యాంకు, కె చక్రధర్ 118/120మార్కులు సాధించి 82వ ర్యాంకు, ఏఎస్ఎస్ కోటేశ్వర రెడ్డి 173ర్యాంకు, సీహెచ్ సాయిమీనాక్షి 302, యు హన్సితపద్మిని 360 ర్యాంకు, సీహెచ్ శృతి 690వ ర్యాంకు, ఆర్ మహేశ్వరి 1056 ర్యాంకు, సి మొహన్య 1710 ర్యాంకులు సాధించారని చెప్పారు. ఇంతటి ఘన విజయం సాధించిన విద్యార్థులకు రూట్స్ స్కూల్ డైరెక్టర్ సుధాకర్ వర్మ, బి విద్యాకాంత్, ఎల్‌కే త్రిపాఠి, ఉపాధ్యాయులు ఎస్‌కే ఖాసిం, పీవీఎస్ దాస్, పి మునేశ్వరరావు అభినందనలు తెలిపారు.

పాలిసెట్‌లో సత్తాచాటిన శశి విద్యార్థులు



వి.ప్రవల్లిక



బి.సరస్వతి



ఎం.మాధుర్య రమాసాయి



ఎస్.సత్యశ్రీ

తణుకు అర్బన్: పాలిసెట్ ఫలితాల్లో తణుకు శశి అకాడమి విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించినట్లు సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. పాలిసెట్‌లో రాష్ట్ర వ్యాప్తంగా తమ విద్యార్థులు వి.ప్రవల్లిక 6వ ర్యాంకు, బి.సరస్వతి 57వ ర్యాంకు, ఎం.మాధుర్య రమాసాయి 81వ ర్యాంకు, ఎస్.సత్యశ్రీ 94వ ర్యాంకు, బీఏడీ చౌదరి 159వ ర్యాంకు, కేఎస్‌వీఎస్ మణికంఠ 197వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను సంస్థ వైస్ చైర్మన్ నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెళ్ల ప్రసాద్, తణుకు శశి క్యాంపస్ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి అరెస్టు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని నవాబుపాలెం గ్రామంలో బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి ఎనిమిది డ్యూటీ పెయిడ్ మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ స్వరాజ్యలక్ష్మి వివరించారు.

ఆటవిడుపు కాదు.. రాటు తేలేందుకు!

- వేసవిని సద్వినియోగం చేసుకుంటున్న చిన్నారులు
- ఆట పాటలతో పాటు వినోదం
- ముగింపు రోజున బహుమతులు అందజేత



గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరం



గ్రంథాలయంలో ఆట పాటలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఏడాదంతా పుస్తకాలతో కుస్తీ పట్టిన చిన్నారులకు వేసవి సెలవులంటే ఒక ఆటవిడుపు, ఒకప్పుడు ఆయా రోజుల్లో కేవలం ఆట, పాటలతో కాలం గడిపేవారు. ఇప్పుడు కాలంతో పాటు తల్లిదండ్రులు దృక్పథం, పిల్లల ఆసక్తిలోనూ మార్పు వచ్చింది. ప్రస్తుత తరంలో పిల్లలు సెలవులు అయ్యేలోగా ఏదో ఒక ఆటపై ప్రత్యేక శిక్షణ తీసుకుంటున్నారు. తాడేపల్లిగూడెంలో ఉచిత శిక్షణ శిబిరాలు నిర్వహిస్తున్నాయి.

నేర్పిస్తున్న.. నేర్చుకుంటున్న ఆటలు

పిల్లలు ఎప్పుడు ఎక్కువగా నేర్చుకుంటున్న క్రీడల్లో పుస్తక పఠనం, విజ్ఞాన, వినోద కార్యక్రమాలు, ఆట పాటలు, కథలు చెప్పడం, చదివించడం, పొడుపు కథలు, జనరల్ నాలెడ్జ్, దేశభక్తి గీతాలు, యోగా, ధ్యానం, చిత్రలేఖనం, పేపర్ క్రాఫ్ట్స్ వంటివి రిసోర్సుపర్సన్స్ నేర్పిస్తున్నారు. అంతేగాక తెలుగు, ఇంగ్లీషు, గ్రామర్, స్పోకెన్ ఇంగ్లీసు, లెక్కలు, సైన్సు పాఠ్యాంశాలలో అవగాహన కల్పిస్తున్నారు. చిన్నారుల్ని తల్లిదండ్రులు సైతం దగ్గరుండి సాయంత్రం సమయాల్లో మైదానాల్లోకి తీసుకెళ్తున్నారు.

పఠనాశక్తిని పెంచేందుకు

వేసవిసెలవులను సద్వినియోగం చేసుకోవడం, గ్రంథాలయాన్ని సందర్శించడంతో బాలబాలికలలో పుస్తక పఠనాసక్తి పెంచేందుకు ఏపీ పౌర గ్రంథాలయ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని గ్రంథాలయాల్లో ఏప్రిల్ 28నుంచి జూన్ 6వరకు సుమారు 40రోజుల పాటు వేసవి విజ్ఞాన శిబిరాలు జరుగుతున్నాయి.

పోటీ పడటం

వేసవి శిక్షణ శిబిరంలో పాఠ్యాంశాలపై అవగాహన కల్పించడమే కాకుండా క్రీడలు నిర్వహించడం వాటిలో పోటీలు, చిత్రలేఖనం తదితర ఇతర పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, పాల్గొన్నవారికి కన్సోలేషన్ ప్రైజ్‌లు అందజేస్తున్నారు. పఠనాసక్తితో పాటు మానసిక వికాసాన్ని పిల్లల్లో పెంపొందించాలనే ఆశయంతో ముందుకు శిబిరాలు జరుగుతున్నాయి.

ఆసక్తిగా నేర్చుకుంటున్నాం



అమ్మమ్మ ఇంటికి వచ్చాను. వేసవి శిక్షణ శిబిరంలో కథలు, పొడుపు కథలు, పద్యాలు, సులువుగా లెక్కలు, ఇతర అంశాలు నేర్పిస్తున్నారు. గ్రంథాలయంలో ఇస్తున్న శిక్షణ ఎంతో ఆసక్తికరంగా ఉంటున్నారు. ఎన్నో విషయాలు నేర్చుకుంటున్నాం. – పి.హర్షిత, 8వ తరగతి, పాలకొల్లు

కొత్త విషయాలపై శిక్షణ



శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా కొత్త విషయాలపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయలో ఏఏ పుస్తకాలు ఉంటాయి. పుస్తక పఠనం ఎలా చేయాలి, విజ్ఞానాన్ని ఎలా పెంపొందించుకోవాలో తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. – కె.పావని సాయి శ్రీ, 2వ తరగతి, జువ్వలపాలెం

ఆట పాటలలో శిక్షణ బాగుంది



పాత కాలంలో ఆడే ఆటలను ఎలా ఆడాలో చూపించారు. ఎన్నో ఆటలు ఆడాం. ఇంట్లోను, పాఠశాలలోను ఎలా ఉండాలో నేర్పించారు. పెద్దలను, గురువులను ఎలా గౌరవించాలో తదితర అంశాలను అవగాహన చేశారు. శిక్షణ బాగుంది. – సీహెచ్ జిజ్ఞాస్, 7వ తరగతి, తాడేపల్లిగూడెం

చదువరులు ఎందుకు వస్తారో చెప్పారు



గ్రంథాలయానికి చదువరులు ఎందుకు వస్తారో చెప్పారు. వివిధ పేపర్స్ రీడింగ్ చేయడం, నవల్స్, మ్యాగజైన్స్, ఇలా ఎన్నో రకాల పుస్తకాలు చదివేందుకు చదవరులు వస్తారు. పోటీ పరీక్ష లకు ప్రిపేర్ అయ్యేందుకు కూడా యువత వస్తారని చెప్పారు. – కె.ఎం.వి.లక్ష్మణ్, తాడేపల్లిగూడెం

ఉపాధి హామీ పథకానికి మొండిచేయి



మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు

తాడేపల్లిగూడెం రూరల్: ప్రపంచ కోటీశ్వరులకు రూ.12లక్షల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్ర ప్రభుత్వం పేదలకు పట్టెడన్నం పెట్టే ఉపాధి హామీ పథకానికి మొండి చేయి చూపుతుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కండెల్లి సోమరాజు ఎద్దేవా చేశారు. బుధవారం మండలంలోని అప్పారావుపేట, మాధవరం గ్రామాల్లో ఆయన పర్యటించి ఉపాధి హామీ పథకం శ్రామికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా సోమరాజు మాట్లాడుతూ ఏ రోజు కూలితో ఆ రోజు జీవించే శ్రామికులకు వేతనాలు ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. శ్రామికుల సమస్యల పరిష్కారానికి దేశ వ్యాప్తంగా ఈ నెల 20వ తేదిన నిర్వహించతలపెట్టిన సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. బుర్రా కనకదుర్గ, కంకిపాటి రామారావు, పెరుమాళ్ల దుర్గాప్రసాద్, సనమండ్ర రామాంజనేయ, విద్య, ఆంజనేయులు, మిద్దే ఆంజనేయులు ఏడిద అప్పారావు, పులిదిండి శ్రీను, షేక్ నాగూర్, కోటేశ్వరి, కొడవటి బాబూరావు, కండెల్లి వెంకటేశ్వరరావు, మల్లులు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ సమ్మెను జయప్రదం చేయాలి



తణుకులో నిరసన తెలుపుతున్న కార్మికులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ప్రతాప్

తణుకు అర్బన్: లేబర్ కోడ్స్‌కి వ్యతిరేకంగా ఈనెల 20న నిర్వహించనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో వివిధ రంగాల కార్మికులకు సమ్మె కరపత్రాలు పంపిణి చేసి సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో విషయాలుపై కమిటీలు వేసే ప్రభుత్వాలు కార్మికులు, కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు జీవనంపై ఒక అధ్యయన కమిటీ వేయడం వలన ఎన్నో విషయాలు బయటకు వస్తాయని అన్నారు. కార్మికులు, ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని ఎన్నో సంవత్సరాలుగా పోరాటం చేస్తున్నప్పటికీ ప్రభుత్వం విననట్లుగా వ్యవహరించడం బాధాకరమని ఎద్దేవా చేశారు. పర్మినెంట్ స్థానాల్లో కాంట్రాక్టు ఔట్ సోర్సింగ్ కార్మికులతో ఎలాంటి సౌకర్యాలు కల్పించకుండా వెట్టి చాకిరీ చేయించుకొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హమాలీ కార్మికులు ప్రమాద బీమా రూ.10లక్షలు, పీఎఫ్, ఈఎస్ఐ వంటి సౌకర్యాలు అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గార రంగారావు, ఎస్. చిన్నారావు, మధు, సతీష్, శేఖర్, రాముడు, లక్ష్మణుడు, రాజు, సూరిపండు, నర్సింహా మూర్తి, మహేష్, కరుణాకర్, సజీవ రాజు, సత్యనారాయణ, బాబురావు పాల్గొన్నారు.

జనరల్ నాలెడ్జ్‌పై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్‌పై శిక్షణ ఇస్తున్న దృశ్యం

అత్తిలి: వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో బుధవారం విద్యార్థులకు గణిత చమత్కారాలు, జనరల్ నాలెడ్జ్‌పై రిసోర్సుపర్సన్ బి శ్రీనివాస్ శిక్షణ ఇచ్చారు. ప్లాస్టిక్‌వాడకం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ వాడకం వల్ల పర్యావరణానికి ముప్పు ఏర్పడే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరూ బయటకు వెళ్లేటప్పుడు గుడ్డసంచులు, జూట్ సంచులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డి కృష్ణారావు, ఆర్ దానకృష్ణ, డి థెరిస్సా రాణి, గంధం శేషవేంద్రరావు, యశస్విని, ఎం శ్రీదేవి, వై ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో శశి విజయభేరి

తణుకు అర్బన్: ఏపీఆర్‌జేసీ ఫలితాల్లో శశి ఇంగ్లీషు మీడియం హైస్కూలు విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించినట్లు సంస్థ చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. ఎంపీసీ విభాగంలో తమ విద్యార్థులు బి.ప్రవల్లిక స్టేట్ 21వ ర్యాంకు, వీఎం దేవదాస్ స్టేట్ 50వ ర్యాంకు, టి.యశ్వంత్‌కుమార్ స్టేట్ 51వ ర్యాంకు, ఎ.వీరలోకేష్ స్టేట్ 79వ ర్యాంకు, బైపీసీ విభాగంలో ఎస్.సత్యశ్రీ స్టేట్ 16వ ర్యాంకు బి.సరస్వతి స్టేట్ 29వ ర్యాంకు, పి.మణిమాలతి స్టేట్ 30వ ర్యాంకు, ఎ.మౌనికసాయి స్టేట్ 32వ ర్యాంకు, కెవీసీవీ సత్య మణికంఠ స్టేట్ 34వ ర్యాంకు, ఎంఎస్ఎస్ అక్షయ స్టేట్ 52వ ర్యాంకు, వీటీ సూర్యలక్ష్మి స్టేట్ 58వ ర్యాంకు, ఎస్‌కే వికాస్‌రెడ్డి స్టేట్ 64వ ర్యాంకు, ఎంఈసీ విభాగంలో ఎస్.కార్తికేయ స్టేట్ 10వ ర్యాంకు, పి.జీవన్ సహర్ష్ స్టేట్ 27వ ర్యాంకు, ఎస్.హర్షిత్ చౌదరి స్టేట్ 36వ ర్యాంకు, పి.దేవిశ్రీ సంజయరెడ్డి స్టేట్ 49వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. వందలోపు ర్యాంకులు 16మంది సాధించారని తెలిపారు. అత్యున్నత ర్యాంకులు సాధించిన విద్యార్థులను సంస్థ వైస్ చైర్మన్ నరేంద్రకృష్ణ, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మేకా క్రాంతిసుధ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు నాదెళ్ల ప్రసాద్, తణుకు శశి క్యాంపస్ ఇన్‌చార్జ్ నిమ్మగడ్డ రాజేంద్రప్రసాద్ అభినందించారు.

ఎయిడ్స్ నియంత్రణపై కళాజాత



ఎయిడ్స్ అవగాహన కల్పిసస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హెచ్ఐవీ ఎయిడ్స్ అంటు వ్యాధి కాదని అంటించుకునే వ్యాధి అని దీనిపై అవగాహన కలిగి ఉంటే ప్రాణాలు దక్కించుకోవచ్చునని ఎయిడ్స్ నియంత్రణ మండలి కళాజాత బృంద సభ్యులచే ప్రజలకు అవగాహన కల్పించారు. పట్టణంలో బ్రహ్మానందరెడ్డి మార్కెట్‌లో బుధవారం మండలి సభ్యులు ఆధ్వర్యంలో డప్పు కళాకారులతో ఎయిడ్స్ వ్యాధి, సోకే విధానం, ఐసీటీఎస్ కేంద్రం అవశ్యకత, ఏఆర్‌టీ సెంటర్ ప్రాధాన్యత, హెచ్ఐవీ టోల్‌ఫ్రీ నెంబర్ 1097 తదితర అంశాలపై అవగాహన చేశారు. ఐసీటీఎస్ డీఎస్ఆర్‌సీ కౌన్సిలర్, గుడ్ ల్యాంప్ ఆర్గనైజేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దోమ కాటు వద్దు.. దోమ తెరలు ముద్దు



పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

తాడేపల్లిగూడెం (టీఓసీ): దోమ కాటు వద్దు.. దోమ తెరలు ముద్దు అని సబ్ యూనిట్ అధికారి వై.వీ.లక్ష్మణరావు ప్రజలకు పిలుపు నిచ్చారు. దోమ కట్టుడం ద్వారా వచ్చే వ్యాధులు, ఆరోగ్య పరిరక్షణపై పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం కడకట్ల పరిధిలని 33, 34, 35 వార్డులలో బుధవారం వెక్టార్ కంట్రోల్ హైజీస్, ఫ్రై డే డ్రై డే కార్యక్రమాలు, క్షేత్రస్థాయి పరిశీలనలు, ర్యాలీలు జరిగాయి. లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణకు హెల్త్ సిబ్బంది కృషి చేయాలన్నారు. దోమల నివారణకు ప్రజల భాగస్వామ్యం తప్పదని, లార్వాను కనుగొనుటలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రతగా ఉండే విధంగా చూసుకోవాలని, వైద్య బృందాలకు సహకరించాలని, దోమలను నిలువరించేందుకు దోమ తెరలు తప్పక వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు రాజేశ్వరి, కృపమ్మ, జ్యోతి, దుర్గాదేవి, ఆశా కార్యకర్తలు స్వప్న, లక్ష్మి, స్వాతి, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అందరికీ ఇళ్ల పథకానికి మార్గదర్శకాలు జారీ



ఎం.సునీల్ కుమార్

తాడేపల్లిగూడెం రూరల్: అందరికీ ఇళ్ల పథకానికి రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తహసీల్దార్ ఎం. సునీల్‌కుమార్ తెలిపారు. బుధవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పట్టణ ప్రాంతాల్లో రెండు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇంటి స్థలం మహిళ పేరు న ఇవ్వడం జరుగుతుందన్నారు. లబ్ధిదారుడు బీపీఎల్ వర్గానికి చెందిన వారై, తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండాలన్నారు. ఎక్కడా ఇంటి స్థలం, ఇల్లు ఉండరాదన్నారు. గతంలో ఏ ప్రభుత్వం నుంచి ఇల్లు, ఇంటి స్థలం పొంది ఉండకూడదన్నారు. గ్రామ, వార్డు స్థాయిలోనే దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. ప్రతి దరఖాస్తుపై వీఆర్వో లేదా ఆర్ఐ అర్హత పరిశీలన ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తహసీల్దార్, మున్సిపాల్టీలో కమిషనర్ లబ్ధిదారుల తుది జాబితాను జిల్లా కలెక్టర్ ఆమోదానికి పంపిస్తారన్నారు.

బడిబాటను సద్వినియోగం చేయాలి



కె. పెంటపాడు గ్రామంలో ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

పెంటపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని నాణ్యమైన విద్యను పొందాలని ఎంఈవో టీవీ రామకృష్ణ పేర్కొన్నారు. బడిబాట కార్యక్రమంలో మండల విద్యాధికారులు టీవీ రామకృష్ణ, ఎం. శ్రీనివాస్‌ల సూచనల మేరకు బుధవారం హెచ్ఎం డి. లక్ష్మి ఆధ్వర్యంలో మోడల్ ప్రైమరీ పాఠశాల వద్ద ఆమె గ్రామపెద్దలతో కలిసి కె. పెంటపాడు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలను వివరించారు. ప్రైవేటు స్కూళ్లను మించి ప్రభుత్వ పాఠశాల్లో స్మార్ట్ విద్యాబోధన ఉందన్నారు. నాడు– నేడు ద్వారా విశాలమైన తరగతి గదులు, మంచి మధ్యాహ్న భోజనం చిన్నారులకు అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కర్రతో దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

అత్తిలి: మండలంలోని మంచిలి గ్రామంలో జరిగిన శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతరలో వ్యక్తిపై కర్రతో దాడిచేసిన నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి ప్రేమరాజు బుధవారం తెలిపారు. ఈనెల 13వ తేదీ రాత్రి మంచిలి గ్రామంలో శ్రీపల్లాలమ్మ అమ్మవారి జాతర ఊరేగింపులో జరిగిన ఘర్షణలో పడాల హేమదుర్గ సురేష్‌పై అదేగ్రామానికి చెందిన దిలీప్ కర్రతో కొట్టడంతో రక్తస్రావం అయింది. చికిత్స నిమిత్తం తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పి ప్రేమరాజు చెప్పారు.

టౌన్‌లో వర్షం.. రూరల్‌లో జాడే లేని వైనం



తాడేపల్లిగూడెం పట్టణంలో బుధవారం ఉదయం కురిసిన కుండపోత వర్షం



వర్షం దాటికి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిలిచిన నీరు

విభిన్న వాతావరణంలో ప్రజలు విస్మయం



తాడేపల్లిగూడెం - చినతాడేపల్లి రోడ్డులో జాతీయ రహదారి అండర్ పాస్ వద్ద నిలిచిన వర్షపు నీరు



తాడేపల్లిగూడెం - మెట్ట ఉప్పరగూడెం రహదారిలో సబ్ స్టేషన్ సమీపంలో విరిగిపడిన చెట్టు కొమ్మ

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెంలో బుధవారం విభిన్న వాతావరణం నెలకొంది. దీంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేశారు. ఆ వివరాల్లోకెళితే – బుధవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకున్నాయి. ఆకాశం మేఘావృతమై చిన్నపాటి చినుకులు పడ్డాయి. అయితే, అంతలోనే భానుడు మబ్బుల నుంచి చీల్చుకుని బయటకు రావడంతో ఉక్కపోత ప్రారంభమైంది. గంట గడవక ముందే తిరిగి 10.30 గంటల ప్రాంతంలో ఆకాశంలో కారుమబ్బులు అలుముకుని ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఉరుములు, పిడుగుల ధాటికి ప్రజలు బెంబేలెత్తిపోయారు. దాదాపు గంటకు పైగా కురిసిన వర్షంతో తాడేపల్లిగూడెం పట్టణంలోని ప్రధాన రహదారులు జలమయమయ్యాయి. అక్కడక్కడ చెట్ల కొమ్మలు విరిగి పడ్డాయి. అయితే, ఎక్కడా విద్యుత్ లైన్లకు ఇబ్బంది కలగలేదని సమాచారం. ఇదిలా ఉంటే, తాడేపల్లిగూడెం మండలం పెదతాడేపల్లి, ఎల్.అగ్రహారం ఎల్ అండ్ టీ గృహ సముదాయం, ఆరుగొలను గ్రామాలు మినహా వర్షం జాడ కానరాలేదు. తదుపరి చిన తాడేపల్లి నుంచి బంగారుగూడెం వరకు వర్షపు చినుకు జాడ కనిపించలేదని పలువురు ప్రజలు తెలిపారు. పట్టణ ప్రాంత ప్రజలు చల్లని గాలులను ఆస్వాదించగా, మండల ప్రజానీకం భానుని ప్రతాపానికి ఉక్కిరిబిక్కిరయ్యారని చెప్పక తప్పదు. ఈ వింత వాతావరణంతో ప్రజలు విస్మయాన్ని వ్యక్తం చేశారు.